## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

**రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా**




మాట్లాడుతున్న రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా

మామిళ్లగూడెం, నవంబర్ 22: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా అన్నారు. బుధవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి, కానా రామ్, సత్యేంద్రసింగ్, పోలీస్ పరిశీలకులు బ్రిజేష్ కుమార్ రాయ్, మంజునాథ్, జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్‌తో రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు సమావేశమై జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై వివరించారు. జిల్లాలో12 లక్షల 16వేల 796 మంది ఓటర్లు ఉన్నట్లు, పట్టణ ప్రాంతంలో 404, గ్రామీణ ప్రాంతాల్లో 1052, మొత్తం 1456 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 396 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ.. జిల్లాలో 23 ఎంసీసీ, 17 ఎస్ఎస్‌టీ, 20 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.8.57 కోట్లు సీజ్ చేశామని, 8995 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, జిల్లా నోడల్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## థగ్ ఆఫ్ వార్ స్టేట్ మీట్‌కు గురుకుల విద్యార్థులు



ఎంపికైన బాలురతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు

తిరుమలాయపాలెం, నవంబర్ 22: మండలంలోని మాదిరిపురం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు థగ్ ఆఫ్ వార్ స్టేట్ మీట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పుల్లయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 18న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం రీజియన్ స్థాయిలో జరిగిన అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపిక జరిగినట్లు వివరించారు. త్వరలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ మార్క, వైస్ ప్రిన్సిపాల్ వీణ, పీడీ లక్ష్మయ్య, పీఈటీ హతీరామ్ తెలిపారు.

### తెట్టెలపాడు బీఆర్ఎస్ గ్రామశాఖ ఎన్నిక



గ్రామ అధ్యక్షుడుగా ఎన్నికైన చిర్రా కృష్ణయ్యతో నాయకులు

తిరుమలాయపాలెం, నవంబర్ 22: మండలంలోని తెట్టెలపాడు బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడుగా చిర్రా కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని తెట్టెలపాడులో బుధవారం జరిగిన సమావేశంలో గ్రామ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ప్రస్తుత పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చిర్ర వెంకన్నను బీఆర్ఎస్ బహిష్కరించడంతో నూతన అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శి పోట్ల వెంకన్న, నాయకులు బిళ్లగిరి ధనుంజయ, గుంటి పుల్లయ్య, దొండేటి కోటేశ్వరావు, జనార్దన్‌రావు, కందాళ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మీ అభిమానాన్ని ఎప్పటికీ మరువను

**ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి**

**బీర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యం : సంభాని**

**సంక్షేమానికి మీ సహకారం కావాలి : చంద్రావతి**

**పేద వాడి కోసం పథకాలు : జీవన్ కుమార్**



కందాళను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కూసుమంచి(నేలకొండపల్లి), నవంబర్ 22: ప్రజల అభిమానాన్ని ఎప్పటికీ మరిచిపోనని, మీ అందరి కోసం పనిచేస్తా మళ్లీ అందరి ప్రగతి కోసం బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలంలోని మంగాపురం, ముజ్జుగూడెం, నేలకొండపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న కందాళకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. నేలకొండపల్లిలో భారీగా జనం రావడంతో ప్రదర్శనగా అన్ని వీధులు, కాలనీల్లో తిరిగారు. ఈ సందర్భంగా కందాళకు మహిళలు తిలకం దిద్దారు. కందాళ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, వాటికి ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందన్నారు.

**సంక్షేమ సర్కారు : డాక్టర్ చంద్రావతి**
**బీఆర్ఎస్‌తోనే ప్రగతి : సంభాని**

బీఆర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యం అవుతుందని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి ఆదర్శంగా తెలంగాణ అనేక పథకాలు చేపట్టిందని, దానిని కొనసాగించాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వైరా మాజీ ఎమ్మెల్యే, పాలేరు సమన్వయ కర్త డాక్టర్ బాణోత్ చంద్రావతి అన్నారు.

**పేదవాడి కోసం పథకాలు : జీవన్ కమార్**

రాష్ట్రంలో పేదవాడికి ఉపయోగపడే విధంగా పథకాలు అమల వుతున్నాయని పాలేరు ఎన్నికల సమన్వయ కర్త తాళ్లూరి జీవన్‌కుమార్ అన్నారు. ప్రచారాల్లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వెల్లడించిన మ్యానిఫెస్టోను గుర్తు చేశారు. జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నేలకొండపల్లి సర్పంచ్ రాయపుడి నవీన్, మార్కెట్ చైర్మన్ నంబూరి శాతం, సీడీసీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు గుదిమళ్ల వాసుల జేజేలు

**ఏకతాటిపైకి వస్తున్న ప్రజలు**

**55 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక**



బీఆర్ఎస్‌లో చేరిన ప్రజలతో ఎమ్మెల్యే కందాళ



కందాళను కలిసిన బానోత్ మోహన్, నాయకులు

ఖమ్మం రూరల్, నవంబర్ 22: మండల పరిధిలోని గుదిమళ్ల గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికలకు ముందుగానే క్లీన్‌స్వీప్ చేయబోతుంది. కొద్ది సంవత్సరాలుగా బీఆర్ఎస్‌కు గ్రామ ప్రజలు అండగా నిలబడుతున్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే కందాళ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో గ్రామస్తులు బీఆర్ఎస్‌కు ఆకర్షితులయ్యారు. కొద్ది రోజుల నుంచి ఆయా పార్టీల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా బుధవారం మరో 55 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాన్ని గ్రామ ప్రజల కోరిక మేరకు తిరిగి పంచాయతీగా మార్పు జరిగిందని గ్రామస్తులు ఐక్యతతో నిలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, మండల కార్యదర్శి పేరం వెంకటేశ్వర్లుతోపాటు గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**కందాళ ను వీడను.. కారు గుర్తును మరువను**
**పెద్దతండా బీఆర్ఎస్ అధ్యక్షుడు బానోత్ మోహన్**

ఖమ్మం రూరల్, నవంబర్ 22: వేలాది కుటుంబాలకు ఆరాధ్య దైవంగా మారిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని వీడే ప్రసక్తే లేదని, నా ఊపిరి ఉన్నంత వరకూ కారు గుర్తును మరువను అని మండల కేంద్రం పెద్దతండా పంచాయతీ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాణోత్ మోహన్ అన్నారు. బుధవారం ఆయన మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే కందాళను కలిశారు. మండలంలోని సాయిగణేష్ నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ పెద్దలతో కలిశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోనే అతి పెద్ద పంచాయతీ అయిన పెద్దతండా పంచాయతీకి గ్రామశాఖ బాధ్యతలు అప్పజెప్పడం నాకు అరుదైన గౌరవమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, బాణోత్ కృష్ణ, గడ్డా వీరన్న, సుడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి

ఖమ్మం రూరల్, నవంబర్ 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యపడిందని తిరుమలయపాలెం మాజీ జెడ్పీటీసీ యలకొండ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన గణేష్‌నగర్ బీఆర్ఎస్ కార్యాలయంలో మంత్రి సంభాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే కందాళ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కందాళ నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ, వారికి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు ఉన్నారు.



మాజీ మంత్రి సంభాని సమక్షంలో పార్టీలో చేరిన మాజీ జడ్పీటీసీ దంపతులు

తిరుమలాయపాలెం, నవంబర్ 22: పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గెలిస్తేనే పాలేరు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు అన్నారు. మండలంలోని పిండిప్రోలులో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని, కందాళను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నేడు పిండిప్రోలులో ఎమ్మెల్యే కందాళ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో గ్రామ అధ్యక్షుడు పరికపల్లి చంద్రశేఖర్, నాయకులు పసలాది ముత్తయ్య, దూదిమెట్ల శ్రీను, చామకూరి వెంకటేశ్వర్లు, కిరణ్, గొలుసు మల్సూరు, యనగందుల సత్యం, వీరన్న పాల్గొన్నారు.

కూసుమంచి, నవంబర్ 22: ఎమ్మెల్యే, పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కూసుమంచిలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గ్రామ అధ్యక్షుడు కొక్కిరేణి సీతారాములు, నాయకులు ఆసీఫ్ పాషా, కొక్కిరేణి వీరాస్వామి, వీరవెల్లి వెంకటేశ్వర్లు, అజీజ్, నాగరెడ్డి రవీందర్ రెడ్డి, గుండా చంద్రారెడ్డి, ఉపేందర్, నాగయ్య, పాల్గొన్నారు.

కూసుమంచి, నవంబర్ 22: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కూతురు దీపిక కూసుమంచి మండలం రాజుపేట, పెరికసింగారం గ్రామాల్లో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన పనులతోపాటు, బీఆర్ఎస్ వస్తే మ్యానిఫెస్టోను వివరించారు. గిరిజనులు సంప్రదాయ నృత్యాలు చేశారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయాలని కోరారు.

ఖమ్మం రూరల్, నవంబర్ 22: మన ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్ కారుగుర్తుకు ఓటేసి, మనందరి అభిమాన నాయకుడు కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎంపీపీ బెల్లం ఉమ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రం నాయుడుపేటలోని పలు బూత్‌లలో ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. గడపగడపకూ వెళ్లిన ఎంపీపీ గ్రామ మహిళలు, కాలనీపెద్దలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచడంతో పాటు, పేద మహిళలకు సౌభాగ్య లక్ష్మి ద్వారా నెలకు రూ.3 వేలు అందిస్తారన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు